AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## తెయూ పరిధిలో పీజీ పరీక్షలు ప్రారంభం

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీలో సెమిస్టర్ పరీక్షలు మొదటిరోజైన గురువారం ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులకు సంబంధించి రెండో,నాల్గవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,861 మంది విద్యార్థులకు గాను 1,784 మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. మధ్యాహ్నం జరిగిన బీఎడ్, బీపీఎడ్ పరీక్షకు 1,544 మంది విద్యార్థులకు గాను 1,494 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.






## పెరుగుతున్న శ్రీరాంసాగర్ నీటిమట్టం

**అక్షరటుడే, ఆర్మూర్:** శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ కురుస్తున్న వర్షాలకు భారీగా వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. గురువారం 13,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు (80.5 టీఎంసీలు) కాగా.. 1080.03 అడుగుల (45.758 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. కాగా.. ప్రాజెక్టు పరిధిలోని 6,24,000 ఎకరాలకు ప్రస్తుతం నీటిని వదులుతున్నారు. జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, సరస్వతి కాల్వ ద్వారా 500 క్యూసెక్కులు నీటిని వదులుతున్నారు. 482 క్యూసెక్కుల నీరు ఆవిరిగా వెళ్తోంది. కాగా.. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1081.00 అడుగుల (47.847 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ఏఈఈ కొత్త రవి తెలిపారు.

## నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



**అక్షరటుడే, నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువన గల సింగూరు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తుండడంతో వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 2254 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో గా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1393.33 అడుగుల (5.76 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ఇక నిజాంసాగర్ ఆయకట్టుకు అనుసంధానంగా నిర్మించిన కళ్యాణి రిజర్వాయర్‌లోకి 230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్లకు గాను 408.50 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. అలాగే సింగితం రిజర్వాయర్ లో 416.554 మీటర్లకు గాను 415.504 మీటర్ల మేర నీరు ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన గల సింగూరు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా.. ప్రాజెక్టులో గురువారం సాయంత్రానికి 523.600 మీటర్లకు (29.917 టీఎంసీలు) గాను 522.110 మీటర్లు (22.145 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

జిల్లా కేంద్రంలో పలు శిథిల భవనాలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షా లు కురుస్తున్నాయి. నిత్యం వాన పడుతుండడంతో శిథిల భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఆయా ఇంట్లో ఉంటున్న వారితో పాటు చుట్టుపక్కల వారికి కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో నిజామాబాద్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. పాత భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు ఇస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు



# పురాతన ఇళ్లతో ముప్పు

▸ నగరంలో శిథిలావస్థలో ఉన్న 165 భవనాలు ▸ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తత అవసరం ▸ యజమానులకు నోటీసులు ఇచ్చిన అధికారులు

నగరంలో 60 డివిజన్లలో 4 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లు కలిపి 2 లక్షలకు పైగానే ఉంటాయి. అయితే గత నెలలో నగరపాలక సంస్థ ఐదు జోన్ల పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను గుర్తించారు. ఒక్కో జోన్ల వారీగా గుర్తించి వివరాలను సేకరించారు. ప్రధానంగా నగరంలోని పాత బస్తీలైన గాజుల్‌పేట్, బ్రహ్మపురి, దుబ్బ, బురుడుగల్లి, పెద్దబజార్, ఠాణాగల్లి, కోటగల్లి, సీతారాం నగర్ కాలనీ, అర్సపల్లి, ఖిల్లా రోడ్ తదితర కాలనీలో ఎక్కువగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలు ఉన్నట్లు గుర్తించారు.

### అందులోనే ఉంటున్న పేదలు

నగరంలో చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. అయితే ఆర్థిక స్థోమత ఉన్నవారు వాటికి మరమ్మతులు చేయించుకుంటున్నారు. కొందరు ఆ ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. అయితే పేదలు మాత్రం ప్రమాదకరంగా మారిన ఇళ్లలోనే ఉంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంటిపై టార్పాలిన్ కవర్లు కప్పుకొని కాలం వెల్లదీస్తున్నారు. నగరపాలక సంస్థ చేసిన సర్వేలో మొత్తం 165 భవనాలు శిథిలావస్థకు చేరుకున్నట్లు గుర్తించారు. కొందరు పాత ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోగా.. ఇంకా 110 భవనాల్లో ప్రజలు నివసిస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆర్థిక స్థోమత లేనివారు పాత గోడలకు మరమ్మతులు చేయిస్తూ.. పెంకుటిళ్లకు పాలిథిన్ కవర్లు కప్పుకొని నివసిస్తున్నారు.

### నోటీసులకు స్పందన కరువు

పురాతన ఇళ్లను గుర్తించిన నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటికే నోటీసులు అందజేశారు. అయితే కొందరు ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోగా.. మరికొందరు స్పందించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పాత భవనాల్లో యజమానులు లేకున్నా.. వాటిని అలాగే వదిలేస్తున్నారు. దీంతో పక్కింటి వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అటువైపుగా నడిచే సమయంలో ఎప్పుడు కూలుతాయోనన్నా భయంలో కాలనీవాసులు ఉంటున్నారు. ఇలాంటి వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి కూల్చివేయాలని నగరవాసులు కోరుతున్నారు.

### ఖాళీ చేసి వెళ్లాలి

పురాతన భవనాలతో ప్రమాదం జరగకముందే జాగ్రత్తపడాలి. నగరంలో 165 భవనాలు శిథిలావస్థకు చేరుకున్నట్లు గుర్తించాం. ఇప్పటికే వారికి నోటీసులు కూడా జారీ చేశాం. వరుసగా వర్షాలు పడుతుండడంతో ఆయా ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది. పాత భవనాలతో ఎప్పటికైనా ప్రమాదమే. అందులో ఉన్న వారు వెంటనే ఖాళీ చేసి ఇతర ప్రాంతానికి వెళ్లాలి.

- శ్రీనివాస్, ఏసీపీ, టౌన్ ప్లానింగ్ విభాగం



## పద్మశాలి కల్యాణ మండపానికి నిధులివ్వాలని ఎంపీకి వినతి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** పట్టణ పద్మశాలి కమిటీ ప్రతినిధులు గురువారం ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఎంపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బోర్గాం (పి) శివారులో పద్మశాలి కులస్థులకు చెందిన స్థలంలో కల్యాణమండపం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఆయనను కోరారు. కల్యాణ మండపం, కొత్త తర్పలకు స్థలాలు ఉన్న వారికి రూ.7లక్షల చొప్పున ఎంపీ ఫండ్ ఇవ్వాలని వారు ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఎంపీ అర్వింద్ సానుకూలంగా స్పందించి కల్యాణ మండపం నిర్మాణంతో పాటు తర్పలు, సంఘాల భవన నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి, ప్రధాన కార్యదర్శి చౌకి భూమేశ్వర్, ప్రతినిధులు భూస రవి, బొట్టు వెంకటేష్, ఇప్పకాయల కిషోర్, కోడూరు నాగరాజ్, పుట్ట వీరేందర్, పల్నాటి కార్తిక్, ఆశిష్ తదితరులున్నారు.



## వరి ఉత్పత్తిలో బాన్సువాడది మొదటి స్థానం

**అక్షరటుడే, బాన్సువాడ:** వరి ఉత్పత్తిలో తెలంగాణలో బాన్సువాడ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని బుడ్మి గ్రామంలో నూతనంగా నిర్మించిన సొసైటీ గోదాంను ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాకోర, జలాల్‌పూర్ ప్రాంతాలకు నిజాంసాగర్ కాల్వల ద్వారా నీటిని అందించేందుకు రూ. 300 కోట్లు ఖర్చు చేసి సిద్దాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ గోదాంలు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని, పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి రైతులకు అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గంగుల గంగారం, ఉపాధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, నాందేవ్, గోపాల్ రెడ్డి, ఎజాజ్, పిట్ల శ్రీధర్, అంజిరెడ్డి, గురువినయ్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, ఇందూరు:** సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనలో విడుదల చేశారు. నీటి నిల్వలు, వ్యర్థాల వల్ల డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. మురికినీటి కాల్వలు, విద్యుత్ స్తంభాలు, తీగలతో ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదకర ప్రదేశాలలో హెచ్చరికల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభం



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. దీనికి సంబంధించి అర్హులకు కేటాయింపు ప్రక్రియ శరవేగంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌కు ఆనుకుని ఉన్న ఇళ్లను గురువారం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఐడీవోసీ పక్కన, నాగారం ప్రాంతాల్లో 900 డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా అర్హులను గుర్తించి, ఆమోదం కోసం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి జాబితా పంపుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఇల్లు లేని వారికి, నిరుపేద కుటుంబాలకు, సఫాయి కర్మచారి, వితంతువులు, ఒంటరి మహిళలకు కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా మౌలిక వసతుల కల్పనకు కూడా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పవన్ కుమార్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, రోడ్లు భవనాల శాఖ డీఈ రంజిత్ తదితరులున్నారు.

## సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్‌పీవో నాగరాజు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ, పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, మురికి కాల్వలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. పాడుబడిన ఇళ్లలో ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ గౌడ్, బిల్ కలెక్టర్ రేఖ బాయి, నాగేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



## కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ/ఎల్లారెడ్డి:** విజయవాడలోని కనక దుర్గమ్మ ఆలయాన్ని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈమేరకు గురువారం ఆయనతో పాటు జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మేనల్లుడి వివాహ వేడుకలు విజయవాడలో జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు అక్కడి కనకదుర్గ ఆలయాన్ని సందర్శించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా ఛైర్మన్ కేశ వేణు, వ్యవసాయ కమిషన్ మెంబర్ గడుగు గంగాధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, ఆర్మూర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మేనల్లుడు పవన్ రాజ్ -సాయి శృతి వివాహం విజయవాడలో జరిగింది. ఈ వేడుకలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఎమ్మెల్యే మదన్ మోహన్ కూడా వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## మున్సిపల్ కార్పొరేషన్‌లో సిబ్బంది నిర్లక్ష్యం..

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని మున్సిపాలిటీలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది తమకు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. దీంతో వారికోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు వచ్చే దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఏదైనా అనివార్య కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని వారి కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే గురువారం కేంద్రంలో ఒకే ఒక్కరు విధులు నిర్వహించడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పలేదు. సిబ్బందిలో కొందరు సెలవులో ఉండగా వారి స్థానంలో ఇతరులకు విధులు కేటాయించారు. కానీ వారు గైర్హాజరవడంతో ఒకే ఉద్యోగిని దరఖాస్తులను స్వీకరించారు. దీంతో దరఖాస్తుదారులు గంటలతరబడి వేచి ఉండాల్సి వచ్చింది.



వినతులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది



## పూడికతీత పనులను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు నివాస ప్రాంతాలు, మురికి కాల్వల్లో పూడికతీత పనులను గురువారం కలెక్టర్ వినయ్‌కృష్ణా రెడ్డి, సీపీ సాయిచైతన్య పరిశీలించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని వారు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. కొత్తగా అవసరమైనచోట మురికి కాల్వల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఏ ఒక్క ప్రాంతం కూడా జలమయం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగింపజేయాలని సూచించారు. పోలీస్ కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంను సీపీతో కలిసి కలెక్టర్ సందర్శించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాల వల్ల నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. వారి వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఈఈ మురళీమోహన్ తదితరులున్నారు.



## భారీవర్షా ల నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తం

**అక్షరటుడే, ఇందూరు:** రాబోయే రోజుల్లో భారీ వర్షసూచనలు ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు శాఖలవారీగా అధికారులు ముందస్తు చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూంను సైతం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో విద్యుత్‌శాఖ నుంచి అధికారులు మూడు షిప్టుల్లో పనిచేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. షిఫ్టులవారీగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు తోట రాజశేఖర్, లక్ష్మణ్ నాయక్, పి.రవి, ఎస్.రవి విధులు నిర్వహిస్తున్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 08462 22183 కు సమాచారం అందించాలని కోరారు.



## ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాక్ డ్రిల్


**అక్షరటుడే నిజామాబాద్ సిటీ/బోధన్ :** నాలుగైదురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ఆయా శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను రక్షించే విధానంపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, తెలంగాణ స్పెషల్ పోలీస్, మున్సిపల్ రెవెన్యూ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వరదలు వచ్చినప్పుడు బాధితులను ఎలా రక్షించాలో అధికారులు సిబ్బందికి వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, తెలంగాణ స్పెషల్ పోలీస్ ఏడో బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సిబ్బంది ప్రజలకు సైతం అవగాహన కల్పించారు. సాలూరలోని మంజీర వాగుపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అలాగే నిజామాబాద్ రూరల్, ఇందల్వాయి, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ పరిధిల్లోనూ మాక్‌డ్రిల్ చేపట్టారు.



## రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి




**అక్షరటుడే, నిజాంసాగర్:** రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేయించుకోవాలని ఎస్‌బీఐ నిజాంసాగర్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశం అన్నారు. మండలంలోని అచ్చంపేటలో గురువారం ఎస్‌బీఐ నిజాంసాగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే పథకాలకు లబ్ధి పొందవచ్చన్నారు. అలాగే సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఖాతాదారులు పాల్గొన్నారు.




## చెరువులోకి దూసుకెళ్లిన కారు

**అక్షరటుడే, ఆర్మూర్:** కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మాక్లూరు మండలం కల్లెడలో చోటు చేసుకుంది. బోర్గాం(కె) గ్రామానికి చెందిన రాజారపు శ్రీనివాస్ కల్లెడ గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారులో స్వగ్రామానికి బయలు దేరాడు. అయితే కల్లెడ గ్రామ శివారులో కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

నగరంలోని కోటగల్లిలో గల భక్త మార్కండేయ ఆలయం భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతోంది. శివుడికి పరమ భక్తుడైన మార్కండేయుని కొలిచేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. పద్మశాలీల కుల దైవమైన మార్కండేయ ఆలయాన్ని నిజామాబాద్ నగరంలోని కోటగల్లి ప్రాంతంలో 1965 సంవత్సరంలో నిర్మించారు. కొద్దిపాటి స్థలంలో నిర్మించిన ఈ మందిరం క్రమేపి అభివృద్ధి చెందింది. నాటి ప్రముఖులు ఈ ఆలయానికి అంకురార్పణ చేయగా, అప్పటి పద్మశాలి సంఘం ప్రముఖులు గర్దాసు రామస్వామి, కైరం కొండ నారాయణ, కట్ట సర్వాజీ, అంకం రాములు, ముందుండి ఆలయ నిర్మాణం చేపట్టారు. వీరికి మరికొంతమంది సహాయ సహకారాలు అందించారు.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



# భక్తుల కొంగుబంగారం

# మార్కండేయ మందిరం

చంద్ర శేఖర మాశ్రమే మమ కిమ్ కరిష్యతి వై యమ' అని యముడుతో మార్కండేయుడు అన్నాడు. నేను పరమశివుని పట్టుకుని ఉండగా నీవు ఏమి చేస్తావు అని యముడితో మార్కండేయుడు అన్నప్పుడు, యముడికి కోపం వచ్చి నీవు శివలింగాన్ని కౌగిలించుకుని ఉంటే నేను ఏమి చేయననుకుంటివా.. అంటూ కోపంతో మార్కండేయుడిపైకి పాశం వేశాడు. శివలింగాన్ని మార్కండేయుడు గట్టిగా కౌగిలించుకున్నప్పుడు ఆ పాశం శివలింగంపై పడింది. అప్పుడు శంకరుడికి కోపం వచ్చి నన్ను నమ్ముకుని.. నన్ను పట్టుకుని ఉండగా.. నేనేమి చేయలేనని పాశం వేస్తావా.. అంటూ శంకరుడు ఎడమ కాలుతో యమధర్మరాజు వక్షస్థలం మీద తన్నాడు. యముడు మరణించడంతో దేవతలు అందరూ వచ్చి స్తోత్రం చేస్తే శంకరుడు యమధర్మరాజును బతికించాడు. అప్పుడు శివుడు నా భక్తుల జోలికి వెళ్లవద్దని యమధర్మ రాజుకు ఆజ్ఞ చేశాడని మార్కండేయ పురాణం చెబుతోంది.

### ఏటా వరలక్ష్మి వ్రతం..

ఏటా మార్కండేయ మందిరంలో శ్రావణమాసంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం కన్నుల పండువగా నిర్వహిస్తారు. నగరంలోని కాలనీల నుంచి మహిళలు అధిక సంఖ్యలో ఇక్కడికి తరలివచ్చి వరలక్ష్మి దేవి వ్రతం నిర్వహిస్తారు. ఇక్కడ వరలక్ష్మి వ్రతం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.

### రాఖీ పౌర్ణమిన జంధ్యం ధారణ ప్రత్యేకం..

ఏటా శ్రావణమాసంలో వచ్చే రాఖీ పౌర్ణమి రోజున ఇక్కడ ఒక ప్రత్యేకత ఉంటుంది. నగరంలోని 69 తర్పల నుంచి పద్మశాలి కులస్థులతోపాటు నగర ప్రజలు మార్కండేయ మందిరానికి చేరుకుంటారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మార్కండేయ మందిర కమిటీ ఆధ్వర్యంలో జంధ్య ధారణ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా జంధ్యం ధరించడం తరతరాలుగా ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు.

## సరుకులు ముందే తీసుకెళ్లండి..



**అక్షరటుడే, నిజాంసాగర్:** భారీ వర్షాల నేపథ్యంలో డోంగ్లీ మండలంలోని లింబూర్ జీపీ పరిధిలోని వాడి గ్రామాన్ని అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆర్ఐ సాయిబాబుతో కలిసి ట్రాక్టర్‌పై వాడి గ్రామానికి గురువారం వెళ్లారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తగా మూడు, నాలుగు రోజులకు సరిపడా సరుకులు, కూరగాయాలు ముందే తెచ్చిపెట్టుకోవాలని తహశీల్దార్ ప్రజలకు సూచించారు. స్థానికంగా ఉన్న వాగు పొంగిపొర్లకముందే నిత్యావసర వస్తువులు తీసుకెళ్లి భద్రపర్చుకోవాలని చెప్పారు. అత్యవసరమైన పరిస్థితుల్లో తహశీల్దార్ కార్యాలయం లేదా కంట్రోల్‌రూంకు ఫోన్ చేయాలని సూచించారు.




## ప్రతి ఇంటిపై జెండా ఎగరేయాలి

**అక్షరటుడే, కోటగిరి :** హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు అన్నారు. హర్ ఘర్ తిరంగాలో భాగంగా గురువారం ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. నాయకులు ఏముల నవీన్, వెంకగౌడ్, అశోక్, కిరణ్, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

## మహాలక్ష్మి మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, బోధన్:** మండలంలోని నాగంపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మహాలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవతా విగ్రహ ప్రతిష్ఠాపన జరిపించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బేకరీ సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి మంత్రి రవి, తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల సదస్సును విజయవంతం చేయాలి


**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో నిర్వహించనున్న వికలాంగుల సదస్సును విజయవంతం చేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు సుజాత సూర్యవంశీ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల వితంతుల పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న బోధన్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వికలాంగుల సదస్సును నిర్వహిస్తున్నామని.. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తున్నారని వివరించారు. సదస్సుకు వికలాంగులు, పింఛన్‌దారులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి భూమయ్య, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున, ఎమ్మార్పీఎస్ నాయకులు భూమయ్య చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## నగరంలో గంజాయి విక్రేత అరెస్ట్..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో గంజాయిని విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ స్వప్న తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అసద్‌బాబా నగర్‌లో నివాసముంటున్న షేక్ అక్రం, షేక్ ఇర్ఫాన్ తమ నివాసాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లుగా పక్కా సమాచారంతో దాడులు చేశారు. ఈ దాడిలో షేక్ అక్రం నుంచి సుమారు 4 కిలోల వరకు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు షేక్ ఇర్ఫాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపర్చినట్లు ఆమె తెలిపారు. పరారీలో ఉన్న షేక్ ఇర్ఫాన్‌ను కూడా త్వరలో పట్టుకుంటామని సీఐ స్వప్న తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై మల్లేష్, సిబ్బంది సునీల్, షబ్బీర్, ధర్‌సింగ్, సంజయ్, సుచరిత పాల్గొన్నారు.


## ఘనంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గంలో గురువారం మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బిచ్కుంద పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బిచ్కుందలోని క్యాంప్ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం బిచ్కుంద నుంచి ర్యాలీగా జుక్కల్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పిట్లం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

## సింగంపల్లిలో మహిళను చెట్టుకు కట్టేసి చితకబాదిన బంధువులు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ఓ మహిళను చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మోపాల్ మండలం సింగంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మోపాల్ మండలంలోని పోలీసులు పట్టించుకోకపోవడంతో సీపీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చినట్లు బాధితురాలు పేర్కొంది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ మండలం సింగంపల్లికి చెందిన పల్లికొండ సవిత నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పని చేస్తోంది. అయితే అదే గ్రామానికి చెందిన సవిత బావ పల్లికొండ గంగారం తన ఇంట్లో పెంచుకుంటున్న గొర్రెలు తరచూ సవిత ఇంట్లోకి వచ్చి మూత్రవిసర్జన చేయడం, బియ్యం తినేయడం చేస్తున్నాయి. దీంతో పలుమార్లు సవిత వారికి చెప్పింది. అయినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో చివరకు గంగారాం కొట్టంలో ఉన్న గేదెను సవిత తీసుకొచ్చి గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద ఉన్న చెట్టుకు కట్టేసింది. దీంతో తమ గేదెనే కట్టేస్తావా అంటూ.. బావ గంగారాం, చంద్రంపల్లి లక్ష్మి, ఆయన కొడుకు గంగారాం, కోడలు మమత కలిసి సవితపై మంత్రాలు చేస్తోందని ఆరోపిస్తూ చెట్టుకు కట్టేసి చితకబాదారు. మతిస్థిమితం కోల్పోయిన భర్త, నలుగురు పిల్లలతో కలిసి జీవితం నెట్టుకొస్తున్న సవిత గత్యంతరం లేక మోపాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమకు న్యాయం చేయాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని.. చివరకు సీపీ సాయిచైతన్యను కలిసి ఫిర్యాదు చేసేందుకు గురువారం సీపీ కార్యాలయానికి వచ్చానని ఆమె పేర్కొంది.



## ఇరుకైన రోడ్డులో వాహనాల నిలిపివేత




**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని పలు కాలనీల్లో ఇరుకైన రోడ్లు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రైవేటు వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉంది. దీనికి తోడు ఓ ప్రైవేట్ అంబులెన్స్‌ను ఇక్కడే నిలుపుతూ ఉండడంతో ఇతర వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, వాహనాలను రోడ్లపక్కనే నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని అన్ని కాలనీల్లో ఎప్పటికప్పుడు పర్యటిస్తూ.. ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ కమిషనర్ రవిబాబు తెలిపారు. గురువారం నగరంలోని 8, 9 డివిజన్ కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ విభాగం అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఖాళీ స్థలాల్లో డ్రెయినేజీల్లో చెత్తాచెదారం తొలగించాలని సూచించారు. అనంతరం దోమలు వ్యాప్తి చెందకుండా స్ప్రే చేయించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## అధికారులు స్థానికంగా ఉండాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** భారీ వర్షాల నేపథ్యంలో మండల, గ్రామస్థాయి అధికారులు స్థానికంగా ఉండాలంటూ ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. జుక్కల్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల, గ్రామస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ మారుతి, ఎస్సై నవీన్ చంద్ర, విద్యుత్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దు



**అక్షరటుడే, భీమ్‌గల్:** శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండవద్దని ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. మండలంలోని బెజ్జోర, ముచ్కూర్ గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, మురికినీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అలాగే శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి, అందులోని వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో జావిద్ అలీ, సిబ్బంది ఉన్నారు.